సాక్షి ఖమ్మం

సోమవారం । 22 । జూలై । 2024



అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం

ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లోపంతోనే పెద్దవాగుకు గండి పడిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. 8లో



వైభవంగా స్మృతి యాత్ర

శ్రీ సీతారామచంద్రస్వామికి అపర భక్తురాలైన పొకల దమ్మక్క సేవా స్మృతి యాత్రను వైభవంగా నిర్వహించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం 30° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాలో నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/నేలకొండపల్లి : రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు కల్లూరు మండలం నారాయణపురం నుంచి బయలుదేరి 10.30గంటలకు అశ్వారావుపేట మండలం పెద్దవాగు ప్రాజెక్టును, వరదతో దెబ్బతిన్న గ్రామాలను పరిశీలిస్తారు. సాయంత్రం 4గంటలకు నేలకొండపల్లిలో డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. భైరవునిపల్లి క్రాస్‌రోడ్డు నుంచి కోనాయిగూడెం, పైనంపల్లి, బోదులబండ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 5.30 గంటలకు బయలుదేరి 9గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు.

రవాణా శాఖలో బదిలీలు

ఖమ్మంక్రైం: రవాణాశాఖలో ఉమ్మడి జిల్లా ఉద్యోగులను ఆదివారం బదిలీ చేశారు. పాల్వంచ చెక్‌పోస్ట్‌లో పనిచేస్తున్న ఎంవీఐ నిర్మలారెడ్డిని నిజామాబాద్‌కు బదిలీ చేశారు. ఖమ్మం రవాణాశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సంతోష్‌ను మహబూబాబాద్‌కు, అక్కడ పనిచేస్తున్న రవీందర్‌ను ఖమ్మంకు, భద్రాచలంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఉషాను ఖమ్మంకు, వైరాలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌ను కొత్తగూడెంనకు బదిలీ చేశారు.

విద్యాశాఖలో ఐదుగురికి బదిలీలు

ఖమ్మం సహకారనగర్ : విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న ఐదుగురు సీనియర్ అసిస్టెంట్లు వివిధ జిల్లాలకు బదిలీ అయ్యారు. జోనల్ పోస్టు కావటంతో ఇక్కడి నుంచి వీరు సోమవారం రిలీవ్ అయ్యే అవకాశం ఉండగా.. ఇతర జిల్లాల నుంచి ఐదుగురు జిల్లాకు రానున్నట్లుగా తెలిసింది. వీరంతా తక్షణమే విధుల్లో చేరే అవకాశం ఉంది.

పశువైద్యాధికారుల బదిలీ

ఖమ్మంవ్యవసాయం: పశుసంవర్ధక, పశువైద్య శాఖ అధికారులకు బదిలీలు జరిగాయి. నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం పశువైద్యాధికారి సంజీవ రెడ్డిని కొణిజర్లకు, కొణిజర్లలో పనిచేస్తున్న శ్రీనివాస్ చింతకాని మండలం నాగులవంచకు, పెనుబల్లి మండలం పాత కారాయిగూడెం డాక్టర్ కృష్ణారెడ్డిని తక్కెళ్లపాడుకు, నాగులవంచలో పనిచేస్తున్న డాక్టర్ శ్రీహరిని గోవిందాపురానికి, జిల్లా పశుసంవర్ధక, పశువైద్య కార్యాలయంలో పనిచేస్తున్న డాక్టర్ భువనేశ్వర్‌ను రాజేశ్వరపురానికి, చెరువుమాధారంలో పనిచేస్తున్న డాక్టర్ రాజును జిల్లా పశుసంవర్ధక కార్యాలయానికి, భద్రాద్రి జిల్లా దమ్మపేటలో పనిచేస్తున్న రమేష్‌బాబును ముదిగొండ మండలం వనంవారి కృష్ణాపురానికి, చంద్రుగొండలో పనిచేస్తున్న ఎల్‌వీఎస్ రాంప్రసాద్‌ను గుబ్బగుర్తికి బదిలీ చేశారు. నేలకొండపల్లి పశువైద్య ఏడీగా పనిచేస్తున్న బోడేపూడి శ్రీనివాస రావును జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి, అక్కడి ఏడీ బి.కిరణ్‌ను మహబూబాబాద్ ప్రాంతీయ పశుసంవర్ధక కార్యాలయానికి, పశువైద్యశాఖ కార్యాలయ ఏడీ డాక్టర్ భానును మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరుకు బదిలీ చేశారు. వీరితో పాటు ఇంకా పలువురికి కూడా బదిలీలు జరిగాయి.

అలరించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?'



నాటికలోని సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' నాటిక ప్రేక్షకులను అలరించింది. నైతిక విలువలు, వివాహ వ్యవస్థ, అక్రమ సంబంధాల ఘర్షణలో నలిగిపోతున్న పిల్లలు, వారి భవితవ్యం అంశాలపై రూపొందించిన నాటిక ప్రదర్శన ప్రేక్షకుల హృదయాలను కదిలించింది. విశాఖపట్టణానికి చెందిన తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో ఈ నాటికను ప్రదర్శించారు. పీటీ మాధవ్ రచించిన ఈ నాటికకు చలసాని కృష్ణ ప్రసాద్ దర్శకత్వం వహించారు. నాటిక ప్రదర్శనకు ముందు నిర్వహించిన సభలో అతిథులు జాబిశెట్టి పాపారావు, అమరగాని వెంకటేశ్వరగౌడ్ మాట్లాడుతూ.. 84 నెలలుగా పట్టువదలని విక్రమార్కులుగా నాటికలను ప్రదర్శించి కళాకారులు, కళాభిమానుల మన్ననలు పొందటం అభినందనీయమన్నారు. అనంతరం అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ (ఆర్క్స్) కార్యదర్శి అన్నాబత్తుల సుబ్రహ్మణ్య కుమార్, కోశాధికారి దేవేంద్ర మాట్లాడుతూ.. నెలనెలా వెన్నెల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 9, 10, 11వ తేదీల్లో నాటిక పరిషత్ ఆహ్వాన నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, మోటమర్రి జగన్మోహన్‌రావు, నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం, నందిగామ కృష్ణ, మారుతి కొండల్‌రావు, వీరబాబు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తు.. యువత చిత్తు



'ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన ఓ యువకుడు పదో తరగతిలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. డిప్లొమాలో చేరాక గంజాయికి బానిసై చదువు మానేశాడు. అమ్మమ్మ దగ్గర ఉంటున్న ఆయన నిత్యం ఆమెను డబ్బు కావాలని వేధించాడు. ఈ క్రమంలో గంజాయి కోసం డబ్బు ఇవ్వకపోతే చంపుతానని బెదిరించాడు. ఆమె నిరాకరించడంతో ఈనెల 15న రాత్రి దాడి చేసి చంపేశాడు. ఇదొక్కటే కాదు.. ఇటీవల జిల్లాలో గంజాయికి డబ్బులు ఇవ్వడం లేదన్న దాడుల పరంపర కొనసాగుతోంది. మత్తులో వారే ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం, ఇతరులపై కూడా దాడులు చేస్తున్న ఘటనలు పెరిగాయి'.

జిల్లా మీదుగా భారీగా రవాణా

- విచ్చలవిడిగా వినియోగం, విక్రయాలు
- ఏడు నెలల్లోనే రూ.37 లక్షల విలువైన సరుకు స్వాధీనం
- అడ్డుకట్ట వేసేలా పోలీస్ శాఖ దృష్టి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: గంజాయి మత్తుకు యువత చిత్తవుతోంది. ఇది చాలా సులభంగా లభ్యం అవుతుండడంతో తెలిసీ తెలియని వయసులో దీనికి అలవాటు పడుతున్నారు. ఇటీవలి కాలంలో జిల్లాలో గంజాయి వినియోగం, విక్రయాలు అరికట్టేందుకు పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. అయినా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి జిల్లా మీదుగా తరలుతూనే ఉంది. గతంలో ప్రత్యేక వాహనాల్లో మాత్రమే గంజాయి తరలించగా.. ఇప్పుడు రైళ్లు, ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలపై కూడా రవాణా సాగుతోంది. పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టి దాడులు నిర్వహిస్తున్నా ఈ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. గంజాయిని అరికట్టేందుకు జిల్లా పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలకు ఉపక్రమించింది. ప్రత్యేక బృందాల ఏర్పాటుతోపాటు సమాచారం అందించేందుకు కమిషనరేట్‌లో యాంటీ నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసింది.

యథేచ్ఛగా రవాణా..

జిల్లా మీదుగా గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతోంది. సరిహద్దు ప్రాంతాల నుంచి ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలింపునకు జిల్లా అనువుగా మారింది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి భద్రాద్రి, ఖమ్మం జిల్లాల మీదుగా సరఫరా అవుతోంది. అలాగే ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాల నుంచి కూడా గంజాయి రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇటీవల గంజాయి రవాణాను అరికట్టేందుకు పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా, వాటిని తప్పించుకుని సరుకు తరలుతోంది. గతంలో ప్రత్యేక వాహనాలు లేదా రైళ్లల్లో గంజాయి తరలించేవారు. అయితే ఇప్పుడు దీని రవాణాను కూడా సులభతరం చేశారు. ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో కూడా ఇతర ప్రాంతాలకు చేరవేస్తుండడం గమనార్హం. ఇటీవల ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపంలో కొందరు గంజాయిని నిల్వ ఉంచి.. రవాణా చేస్తున్న విషయం వెలుగు చూసింది. అలాగే మరికొందరు యువత దీన్ని జీవనోపాధిగా చేసుకుని సరఫరా చేస్తుండటం విశేషం. ఇటీవల చాలామంది యువతను పోలీసులు గుర్తించి హెచ్చరించి వదిలేశారు.

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు నమోదైన కేసులు

ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన కేసులు	17	అరెస్టయిన నిందితుల సంఖ్య	67
స్వాధీనం చేసుకున్న గంజాయి	78 కేజీలు	గంజాయి విలువ రూ.	37 లక్షలు

విపరీతంగా వినియోగం..



చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా గంజాయి వినియోగించే వారి సంఖ్య ఇటీవలి కాలంలో ఎక్కువైంది. గంజాయి మత్తులో పలు చట్ట విరుద్ధ కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఇలాంటి అనేక ఘటనలు చోటుచేసుకున్నాయి. గంజాయి మత్తులో గ్యాంగ్‌వార్‌లు, పరస్పరం హత్యాయత్నం చేసుకోవడం వంటివి సర్వసాధారణమయ్యాయి. మత్తులో ఏం చేస్తున్నామో తెలియని పరిస్థితిలో యువత జోగుతోంది. గంజాయి వినియోగంతో శాంతిభద్రతలకు కూడా విఘాతం కలుగుతోంది. ప్రధానంగా ఖమ్మం నగరంలో గంజాయి మత్తులో విపరీత చర్యలకు పాల్పడిన ఘటనలు అనేకం ఉన్నాయి.

ఉక్కుపాదం మోపేలా..

మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమీక్షలో మత్తు పదార్థాలను అరికట్టడంలో కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గతంలోనూ పోలీస్ శాఖ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం, బస్టాండ్, రైల్వేస్టేషన్, ఇతర రద్దీ ప్రాంతాలు, కూడళ్లలో తనిఖీలు చేపట్టడం వంటి చర్యలు చేపట్టింది. దీంతో పలుచోట్ల గంజాయిని పట్టుకున్నారు. తరలిస్తున్న వారిపై నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం కింద కేసులు బుక్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల గుండా గంజాయి తరలిపోకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టారు.

గంజాయిపై పోలీస్ పంజా..

ప్రభుత్వ ఆదేశాలతో మరింత కఠినంగా ఉండేందుకు పోలీస్‌శాఖ చర్యలకు పూనుకుంది. డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించడానికి ప్రత్యేక బృందాలు పనిచేయనున్నాయి. ప్రధానంగా డీ అడిక్షన్, ప్రి వెన్షన్ పైన దృష్టి పెట్టిన పోలీస్‌శాఖ యాంటి నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసింది. మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాల సమాచారాన్ని 87126 59123 నంబర్‌కు వాట్సప్ లేదా ఎస్సెమ్మెస్ రూపంలో తెలిపే వీలుంది. అలాగే విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పల్లెల్లో ర్యాలీలు, సదస్సులు నిర్వహించి డ్రగ్స్ అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోలీస్‌శాఖ ఉపక్రమించింది. అలాగే గంజాయి వాడుతున్న వారిని సైతం గుర్తించి వైద్య సదుపాయం అందించేందుకు చర్యలు చేపట్టింది.

సమూలంగా నియంత్రిస్తాం..



కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాల సరఫరాను సమూలంగా నియంత్రిస్తాం. సరిహద్దు రాష్ట్రాల నుంచి తరలించే గంజాయిపై రాత్రి గస్తీ, పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. అలాగే విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఆయా సంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నాం. కట్టుదిట్టంగా నిఘా ఏర్పాటుచేయాలని సిబ్బందికి సూచించాం. – సునీల్‌దత్, పోలీస్ కమిషనర్

ఉధృత గోదావరి



రెండు బ్రిడ్జిల నడుమ గోదావరి పరవళ్లు

రెండో ప్రమాద హెచ్చరికకు చేరువలో నీటిమట్టం

- ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు రాకపోకలు బంద్
- పునరావాస శిబిరాలకు ముంపు కుటుంబాలు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి : భద్రాద్రి జిల్లా కలెక్టర్

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం ఉదయం నుంచి క్రమంగా పెరుగుతూ వచ్చిన గోదావరి సాయంత్రం 6.51 నిమిషాలకు 43 అడుగులకు చేరుకుంది. దీంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అనంతరం అదే వేగంతో నీటిమట్టం పెరుగుతూ వచ్చింది. రాత్రి 9 గంటలకు 44 అడుగులతో 9,74,666 క్యూసెక్కుల మేర నీరు ప్రవహించింది. రాత్రి 10గంటలకు 44.40 అడుగులు, 12 గంటలకు 45.01 అడుగులు నమోదైంది. ఇక గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు.

వచ్చిన నీరు వచ్చినట్లుగానే...

గోదావరికి ఎగువన కురుస్తున్న వర్షాలతో పాటు ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షాలతో తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుకుంది. దీంతో వచ్చిన వరద వచ్చినట్లుగానే ఉదయం నుంచి 25 గేట్లు ఎత్తి నీటిని గోదావరిలోకి వదిలారు. ఉదయం ఇన్‌ఫ్లో 43,603 క్యూసెక్కులు ఉండగా సాయంత్రానికి 44,535 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో రాత్రి 7 గంటలకు 80,305 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. అదేవిధంగా చర్ల మండలంలో ఎడతెగని వర్షం కురవడంతో జిల్లాలోనే అత్యధికంగా 68.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. భద్రాచలం ఆర్‌డీఓ దామోదర్‌రావు దుమ్ముగూడెం మండలంలో పునరావాస శిబిరాలను పరిశీలించి రెవెన్యూ అధికారులు, సిబ్బందికి తగు సలహాలు, సూచనలను ఇచ్చారు. చర్ల మండలం తేగడ గ్రామంలో లోతట్టు ప్రాంత కుటుంబాల వారిని పునరావాస శిబిరాలకు తరలించారు. భద్రాచలంలోని కరకట్టల వద్దనున్న స్లూయిజ్‌ల వద్ద ఏర్పాటుచేసిన మోటార్ల ద్వారా పట్టణంలోని వర్షపు నీటిని గోదావరిలోకి ఎత్తిపోస్తున్నారు. కరకట్ట, స్నానఘాట్‌ల వద్దకు భక్తులను, సందర్శకులను అనుమతించటం లేదు.

ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకల్ బంద్..

గోదావరి వరద పెరగటంతో పాటు ఏపీలోని వీఆర్ పురం, కూనవరం నడుమ ఉన్న శబరి ఉపనది పోటెత్తడంతో పలు చోట్ల ప్రధాన రహదారులపైకి గోదావరి నీరు వచ్చింది. ఏపీలోని పోలిపాక వద్ద రోడ్డుపైకి వరద నీరు రావడంతో కూనవరం, వీఆర్ పురం, చింతూరు మండలాలకు రాకపోకలు స్తంభించాయి. ఇక ఏపీలోని చట్టి వద్ద రోడ్డుపైకి గోదావరి నీరు చేరడంతో భద్రాచలం నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో పలు గ్రామాల నడుమ పొంగిన వాగులు అలాగే ఉండటంతో రాకపోకలు ఇంకా సాగడం లేదు.

అంతా అప్రమత్తంగా ఉండాలి..

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి పెరుగుతుండడంతో లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల ముంపు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలిరావడానికి అధికారులకు సహకరించాలని కోరారు. ప్రజలు వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయొద్దని, అత్యవసరమైతే భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ చేయాలని సూచించారు. జలాశయాల వద్దకు ప్రజలు రాకుండా పటిష్ట నియంత్రణ చేపట్టాలని, వరద నిలిచిన రహదారులల్లో రవాణా నియంత్రణకు ట్రాక్టర్లు అడ్డు పెట్టాలని అధికారులను ఆదేశించారు. అనుక్షణం అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు.

పాలేరుకు చేరిన సాగర్ జలాలు

కూసుమంచి: నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా శనివారం నీరు విడుదల చేయగా ఆదివారం సాయంత్రం పాలేరు రిజర్వాయర్‌కు చేరాయి. రిజర్వాయర్‌కు ప్రస్తుతం 1,100 క్యూసెక్కుల నీరు చేరుతుండగా అది క్రమంగా 3వేల క్యూసెక్కులకు చేరనుంది. రిజర్వాయర్‌కు ఒక టీఎంసీ నీటిని విడుదల చేయనుండగా నాలుగు రోజుల పాటు నీటి సరఫరా కొనసాగుతుంది. రిజర్వాయర్ నీటిమట్టం ఆదివారానికి 5.55 అడుగులకు పడిపోగా సాగర్ జలాల చేరికతో క్రమంగా పెరుగుతోంది. దీంతో జిల్లాలో తాగునీటి సమస్య తీరనుంది. నాయకన్‌గూడెంలోని ఇన్‌ఫాల్ రెగ్యులేటరీ గేట్ల వద్ద ఇరిగేషన్ ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ, డీఈఈ మురళీకృష్ణ నీటి సరఫరాను పరిశీలించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

- సీజనల్ వ్యాధుల నేపథ్యాన అప్రమత్తత
- ప్రజలూ సహకరిస్తే సమస్యల పరిష్కారం
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ రవిబాబు

సత్తుపల్లి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉంటూ స్పెషల్ డ్రైవ్‌గా పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం.. ఈ విషయంలో ప్రజలు కూడా అవగాహన పెంపొందించుకుని సహకరిస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది..' అని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు వెల్లడించారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్లపై చేరుతున్న వరద నీరు, కోతులు, కుక్కల బెడద తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లేందుకు 'సాక్షి' ఆధ్వర్యాన ఫోన్ ఇన్ నిర్వహించగా ప్రజల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలు, కమిషనర్ ఇచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న : సిద్ధారంరోడ్ చెరువులా తయారైంది. రూ.లక్షలు ఖర్చుపెట్టి డ్రెయినేజీ నిర్మిస్తే కొందరు మట్టితో మూసివేశారు. రోడ్డుపై నీళ్లు చేరి రైస్ మిల్లులోకి వచ్చి ధాన్యం బస్తాలు తడిసిపోతున్నాయి. రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

– దామెర రమేష్, గుడిమెట్ల సోమేశ్వరరావు, సత్తుపల్లి

కమిషనర్ : సిద్ధారం–రాజీవ్‌నగర్‌రోడ్‌ను పరిశీలించాను. రోడ్డుపై నీళ్లు వస్తున్న మాట వాస్తవమే. మూసుకుపోయిన డ్రెయిన్లను జేసీబీతో శుభ్రం చేయిస్తాం. మిల్లు వెనుక శాశ్వత డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం.



మందా రవిబాబు

ప్ర : దోమల ఫాగింగ్ సరిగ్గా చేయడం లేదు. రాజీవ్‌నగర్‌లో రోడ్డుపై బురద నీటితో దోమల బెడద పెరిగింది.

– ఎస్.బద్రీనాథ్, రాజీవ్‌కాలనీ

క : రాజీవ్‌కాలనీలో వరద నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడతాం. అన్నిచోట్లా ఫాగింగ్ చేసేలా సిబ్బందికి సూచనలు ఇస్తాం.

ప్ర : కోతుల బెడదతో బయటకు రాలేకపోతున్నాం. చింతలపాటి వీధిలో కోతుల సమస్య మరీ తీవ్రంగా ఉంది. వృద్ధులు, పిల్లలు బయటకు రావాలంటే రాలేని పరిస్థితి నెలకొంది.

– ముత్తా వెంకటేష్, 16వ వార్డు

క : పట్టణంలో కోతుల సమస్యను అరికట్టేలా తగిన చర్యలు తీసుకుంటున్నాం. కోతులను పట్టి అడవిలో వదిలేందుకు నిర్ణయించాం.

ప్ర : వర్షానికి బస్టాండ్ రింగ్‌రోడ్ గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. దీన్ని సరిచేయడంతో పాటు కోనోకార్పస్ మొక్కలను కటింగ్ చేయకుండా వేళ్లతో సహా తొలగించాలి.

– చంద్రశేఖర్, సత్తుపల్లి

సాక్షి ఫోన్ ఇన్

క : వర్షంతో బస్టాండ్ రింగ్ సెంటర్‌లోనే కాక పలుచోట్ల రోడ్డు దెబ్బతింది. నేషనల్ హైవే అధికారులకు రోడ్డు మరమ్మతుపై సమాచారం అందించాం. డివైడర్‌లోని కానోకార్పస్ మొక్కలను పూర్తిగా తొలగిస్తాం.

ప్ర : మా ఇంటి పక్కన స్థలమంతా పిచ్చిమొక్కలతో నిండి ఉంది.

– ఆంజనేయులు, లలితకుమారి ఆస్పత్రిరోడ్, సత్తుపల్లి

క : స్థలం యజమానులకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటాం.

ప్ర : మా వార్డులో డ్రెయినేజీ లేదు, బైపాస్ నుంచి హెచ్‌పీ బంక్ వరకు డ్రెయినేజీ మూసుకుపోయింది.

– గంద్ర విజయసారథిరెడ్డి, 21వ వార్డు, సత్తుపల్లి

క : సీఎస్ఐ చర్చి రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదించాం. బంక్ సమీపాన డ్రెయినేజీలు శుభ్రం చేస్తాం.

ప్ర : మా వీధిలో వారంరోజుల నుంచి లైట్లు వెలగడం లేదు. పాములు, వీధి కుక్కల బెడద ఉంది.

– భీమిశెట్టి నాసరయ్య, విద్యానగర్‌రోడ్, సత్తుపల్లి

క : వీధిలైట్ల సమస్య తక్షణం మాట్లాడి పరిష్కరించాం. మీ వీధిలో స్పెషల్‌డ్రైవ్ ద్వారా చెత్త తొలగిస్తున్నాం. విష సర్పాల బెడద తొలగించేలా చర్యలు చేపడతాం.

ప్ర : మా ఇంటి ముందు ఇల్లు కూలేందుకు సిద్ధంగా ఉంది. ఆ ఇంటిని పందులు, కుక్కలు ఆవాసంగా మార్చుకున్నాయి.

– జనకనూరి శైలజ, జవహర్‌నగర్, సత్తుపల్లి

క : తక్షణం పాడుబడిన ఆ ఇంటిని కూల్చేందుకు చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. మీ ఫోన్ నంబర్ తీసుకుంటున్నాం.

ప్ర : కుక్కల బెడదతో బయట తిరగలేకపోతున్నాం.

– తడికమళ్ల దిలీప్, ముబారక్, సత్తుపల్లి

క : కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు చేపడుతున్నాం. స్పెషల్ డ్రైవ్ ద్వారా కుక్కలను పట్టుకుంటాం.

ప్ర : మా ఇంటి పక్కన చికెన్‌షాప్‌తో దుర్వాసన వస్తోంది. అంతేకాక పాములు, విష కీటకాలు వస్తున్నాయి.

– కొండల్‌రావు, కాకర్లపల్లిరోడ్, సత్తుపల్లి

క : తక్షణమే దుకాణదారుడికి నోటీసులు ఇస్తాం. ఇళ్ల మధ్యలో కోళ్లు పెంచకుండా చర్యలు తీసుకుంటాం.

ప్ర : సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి.

– పోలిశెట్టి శివకుమార్, హనుమాన్‌నగర్, సత్తుపల్లి

క : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై గంగారం పీహెచ్‌సీ వైద్యులతో మాట్లాడి అవగాహన కల్పిస్తాం. ప్రజలు కూడా స్వచ్ఛందంగా పరిశుభ్రత పాటించాలి.

ప్ర : మసీద్‌రోడ్డులోని కోతమిల్లు సమీపాన బోరు తెల్లవారుజామునే వేయడంతో నీళ్లు పట్టుకోలేకపోతున్నాం. సమయం కూడా తక్కువగా ఇస్తున్నారు. – షేక్ దస్తగిరి, మసీద్‌రోడ్, సత్తుపల్లి

క : ఉదయం 6 గంటల సమయాన మోటార్ వేసేలా సిబ్బందికి సూచనలు ఇస్తాం. అందరికీ నీళ్లు పట్టుకునే సమయం కల్పిస్తాం.

వీడని వాన..

- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ముసురు
- ఊపందుకుంటున్న వరి సాగు

ఖమ్మంవ్యవసాయం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షం కురుస్తూనే ఉంది. శుక్ర, శనివారాలతో పోలిస్తే ఆదివారం వర్ష తీవ్రత కొంత తగ్గింది. ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వాతావరణ శాఖ విడుదల చేసిన వర్షపాతం వివరాల ప్రకారం.. జిల్లాలో అత్యధికంగా గేటు కారేపల్లిలో 12.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో 9.3, కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో 8.5, కామేపల్లి మండలం లింగాల, రఘునాథపాలెం మండల కేంద్రంలో 8.0, మధిరలో 7.5, తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో 7.3, తిరుమలాయపాలెం, ముదిగొండ మండలం పమ్మిలో 6.8, బాణాపురం, పెద్దగోపతిలో 6.5, మంచుకొండలో 6.3, చింతకానిలో 6.0, పల్లెగూడెంలో 5.8, తల్లాడలో 5.5, ఖమ్మం నగరంలోని ప్రకాష్‌నగర్, కూసుమంచిలో 5.3 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ఊపందుకుంటున్న వరిసాగు

ఆరు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో జిల్లా వ్యాప్తంగా వరిసాగు ఊపందుకుంటోంది. భూగర్భ జలమట్టం పెరగటంతో పాటు, జలాశయాల్లోకి సమృద్ధిగా నీరు చేరుతోంది. ఇప్పటికే అనేక చెరువులు నిండి మత్తళ్లు పోస్తున్నాయి. ప్రధాన రిజర్వాయర్లలోకి నీరు చేరుతోంది. దీంతో రైతులకు వరి సాగుపై భరోసా కలిగింది. జిల్లాలో వరిసాగు లక్ష్యం 2.83 లక్షల ఎకరాలు కాగా లక్ష్యం మేరకు పంట సాగయ్యే అవకాశం ఉంది.

క్లుప్తంగా

ముఖ్వాకు పొంగులేటి అభినందనలు



ముఖ్వాకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు తదితరులు

ఖమ్మంవన్‌టౌన్‌: రాష్ట్ర నీటిపారుదల శాఖ అభివృద్ధి చైర్మన్‌గా ఆదివారం హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించిన ముఖ్వా విజయ్‌బాబును రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. ఆయనతోపాటు శుభాకాంక్షలు తెలిపినవారిలో భద్రాచలం, ఇల్లెందు, అశ్వారావుపేట, నకిరేకల్‌, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, వేముల వీరేశం, పాయం వెంకటేశ్వర్లుతోపాటు టీజీటీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, తుంబూరు దయాకర్‌రెడ్డి, బాలసాని లక్ష్మీనారాయణ, మేకల మల్లిబాబుయాదవ్‌, చింతనిప్పు కృష్ణచైతన్య తదితరులున్నారు.

ఆయుర్వేద వైద్యుడికి గౌరవ డాక్టరేట్‌



డాక్టరేట్‌ అందుకుంటున్న వీరభద్రాచారి

ఖమ్మంవైద్యవిభాగం/ఖమ్మం మామిళ్లగూడెం: ఆయుర్వేద వైద్యంలో విశిష్ట సేవలు అందించిన, ఖమ్మానికి చెందిన ఆయుర్వేద వైద్యుడు రామడుగు వీరభద్రాచారికి న్యూఢిల్లీలోని ఐకానిక్‌ పీస్‌ అవార్డు కౌన్సిల్‌ బాధ్యులు గౌరవ డాక్టరేట్‌ అందించారు. శనివారం రాత్రి న్యూఢిల్లీలోని కాన్సిస్ట్యూషన్‌ క్లబ్‌ ఆఫ్‌ ఇండియా రఫీమార్గ్‌లో జరిగిన వేడుకల్లో ఈ అవార్డును టిబెటన్‌ పార్లమెంట్‌ డిప్యూటీ స్పీకర్‌ ఆచార్య యేషి పుంట్సోక్‌ వీరభద్రాచారికి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. వీడివోస్‌ కాలనీకి చెందిన వీరభద్రాచారి ఆయుర్వేద వైద్యుడిగా నిరుపేద, మధ్య తరగతికి చెందిన దాదాపు 430 మందికి సురక్షిత కాన్పులు చేశారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి విజయ్‌ సంప్లా, రాజ్యసభ సభ్యులు నరేష్‌బన్సల్‌, ఐపీఎస్‌ అధికారి సచిన్‌గుప్తా, మంచ్‌ బిష్ణు ప్రసాద్‌ బర్మల్‌, బ్రహ్మపాల్‌, ఐకానిక్‌ పీస్‌ అవార్డు కౌన్సిల్‌ చైర్‌ పర్సన్‌ సుస్మిత పాల్గొన్నారు.

ఎర్రబోడుతండావాసికి..



భుక్యా కాశీరామ్‌

ఖమ్మంసహకారనగర్‌: ఏన్కూరు మండలం ఎర్రబోడుతండాకు చెందిన భుక్యా కాశీరామ్‌కు డాక్టరేట్‌ లభించింది. ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌ ఎం.గోనానాయక్‌ పర్యవేక్షణలో 'అఫ్సర్‌, ప్రసేన్‌, సీతారాంల కవిత్వం –అనుశీలన'అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్‌ అందుకున్నానని తెలిపారు. కాగా, ఆయనకు స్థానికులు, ఎస్‌ఆర్‌ అండ్‌ బీజీఎన్‌ఆర్‌ డిగ్రీ కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

జిల్లా మత్స్యశాఖ అధికారిగా రాజనర్సయ్య

ఖమ్మంవ్యవసాయం: జిల్లా మత్స్యశాఖ అధికారుల బదిలీల్లో భాగంగా నిజామాబాద్‌ జిల్లా మత్స్యశాఖ అధికారి జి.రాజనర్సయ్యను ఖమ్మం జిల్లాకు బదిలీ చేశారు. ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్‌ మత్స్యశాఖ అధికారిగా పనిచేస్తున్న డి.ఆంజనేయస్వామిని నిజామాబాద్‌ జిల్లా అధికారిగా బదిలీ చేస్తూ ఆ శాఖ రాష్ట్ర కమిషనర్‌ ప్రియాంక ఆల ఉత్తర్వులు జారీ చేశారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్‌: మండల పరిధిలో పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. 664 మంది పర్యాటకుల రాకతో వైల్డ్‌లైఫ్‌ శాఖకు రూ.26,485 ఆదాయం లభించగా, 150 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌ సంస్థకు రూ.7,250 లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఐదు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సింగరేణి(కొత్తగూడెం): గత ఆరు రోజులు సింగరేణి వ్యాప్తంగా కురుస్తున్న వార్షాలతో సుమారు ఐదు లక్షల టన్నుల బొగ్గుఉత్పత్తికి అంతరాయం వాటిల్లింది. మొత్తం 11 ఏరియాల్లో రోజుకు రెండు లక్షల టన్నుల లక్ష్యానికి గాను 1.10 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. దీంతో ఆరు రోజుల్లో సుమారు 5 లక్షల టన్నుల ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. కొత్తగూడెంలో ఆరు రోజుల్లో 78 వేలు, ఇల్లెందులో 30, మణుగూరు ఏరియాలో 45 వేల టన్నుల మేర బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. అయితే అన్ని ఏరియాల్లో ఇంకా ఎక్కువ నష్టం వాటిల్లినా యాజమాన్యం యాడ్‌ కోల్‌ను ఉత్పత్తి చూపించడంతో కొంత మేర రికవరీ అవుతోంది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 18 ఓసీల్లో రోజుకు సుమారు 15 లక్షల క్యూబిక్‌ మీటర్ల ఓబీ వెలికితీయాల్సి ఉండగా, ఈ ఆరు రోజుల్లో 60 లక్షల క్యూబిక్‌ మీటర్ల ఓబీకి అంతరాయం వాటిల్లింది.

అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం

- పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యంతోనే పెద్దవాగుకు గండి
- పంట నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం
- బాధిత కుటుంబాలకు తక్షణ సాయం చెల్లించండి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన భద్రాద్రి జిల్లా కలెక్టర్‌, ఎస్పీ, పీఓ

అశ్వారావుపేటరూరల్‌: ఇరిగేషన్‌ అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యంతోపాటు ప్రాజెక్టు గేట్లను సరిగ్గా ఆపరేట్‌ చేయకపోవడం వల్లే పెద్దవాగుకు గండి పడిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన పెద్దవాగు ప్రాజెక్టును సందర్శించారు. గుమ్మడవల్లి, కొత్తూరు, నారాయణపురంలో వరదతో దెబ్బతిన్న ఇళ్లు, పంటలను పరిశీలించారు. అనంతరం పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోని మహిళా డిగ్రీ కళాశాలలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పెద్దవాగు ప్రాజెక్టు గండి ఘటన బాధాకరమని, ఆస్తి, పంట నష్టం తీర్చలేనిదని అన్నారు. గండి పడడంతో తెలంగాణతో పాటు, ఏపీలోని 12 గ్రామాల్లో నష్టం వాటిల్లిందన్నారు. బుధవారం నాటికే ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకోగా, ఏపీలో భారీ వర్షాలు కురుస్తున్నా ఇరిగేషన్‌ అధికారులు అప్రమత్తం కాలేదని మండిపడ్డారు. ఏపీ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి వరదనీటిని వదిలితే ఈ దారుణం జరిగేది కాదన్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, వరదను అంచనా వేయడంలో ఇరిగేషన్‌ అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవిలోనే ప్రాజెక్టు గేట్లను ఆపరేట్‌ చేసి, మోటార్లు పని చేస్తున్నాయా లేదా చూసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. 1989లో కూడా గేట్లు సక్రమంగా ఆపరేట్‌ కాకపోవడంతో అప్పుడు కుడా గండి పడినట్లు గుర్తు చేశారు. ప్రాజెక్టు గండిపై కలెక్టర్‌ పూర్తి నివేదిక ఇచ్చిన తర్వాతే చర్యలు ఉంటాయన్నారు. వరదలో చిక్కుకున్న 31 మందిని ఎస్పీ రోహిత్‌రాజ్‌ చాకచక్యంగా వ్యవహరించి, ఏపీ అధికారులతో సమన్వయం చేస్తూ సరైన సమయంలో హెలీకాప్టర్లను రప్పించి ప్రాణాలు కాపాడారని అన్నారు. ప్రాణనష్టం జరగకుండా చూసిన ఘనత ఎస్పీ, కలెక్టర్‌కే దక్కుతుందన్నారు. కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ మాట్లాడుతూ.. అశ్వారావుపేటలో శాశ్వతంగా ఒక బోటు ఏర్పాటు చేస్తామని, ఈ బోటు నిర్వహణకు ఒక టీంను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీ రోహిత్‌రాజ్‌, ఐటీడీఏ పీఓ రాహుల్‌, ఆర్డీఓ మధు, డీపీఎ చంద్రమౌళి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ భీకంసింగ్‌, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్‌ సీఈ శ్రీనివాస్‌ రెడ్డి, ఏడీఏ అఫ్జల్‌ బేగం, తహసీల్దార్‌ కృష్ణ ప్రసాద్‌, సొసైటీ చైర్మన్‌ నిర్మల పుల్లారావు, కాంగ్రెస్‌ నాయకులు బండి భాస్కర్‌, మొగళ్లపు చెన్నకేశవరావు, సుంకవల్లి వీరభద్రం, జ్యేష్ట సత్యనారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం..

పెద్దవాగు ప్రాజెక్టు గండి కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, బాధిత కుటుంబాలను ఆదుకుంటామని మంత్రి తుమ్మల తెలిపారు. పంట నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు తక్షణమే బియ్యం, నిత్యావసరాలు, కురగాయాలు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. బురద కారణంగా ప్రభావిత గ్రామాల్లో అంటు వ్యాధులు, జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం ముగిసే వరకు అధికారులకు సెలవులు రద్దు చేశామని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాల వివరాల నివేదికను కలెక్టర్‌కు అందించి కొత్త భవనాలకు ప్రతిపాదనలు చేయాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అదనపు కలెక్టర్‌ మధుసూదన్‌నాయక్‌



పెద్దచెరువు అలుగును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌

కల్లూరు: ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న సమయంలో వాగులు, వంకలు పొంగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారులకు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్‌ మధుసూదన్‌ నాయక్‌ ప్రజలను కోరారు. ఆదివారం అలుగు పారుతున్న కల్లూరు పెద్ద చెరువును ఆయన పరిశీలించారు. కల్లూరు, లక్ష్మీపురం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సహాయ సహకారాలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వ ఆదేశాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంపీఈఓ ఏనుగు సురేశ్‌, కల్లూరు పంచాయతీ ఈఓ సీహెచ్‌ కృష్ణారావు, లక్ష్మీపురం కార్యదర్శికి షోకాజ్‌ నోటీసులు జారీ చేయాలని ఆర్‌డీఓ రాజేందర్‌, ఎంపీడీఓ చంద్రశేఖర్‌లను ఆదేశించారు. కల్లూరు పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయి గృహాల్లోకి నీరు చేరుతోందని ఆయన దృష్టికి తీసుకురాగా పూడిక తొలగించి నీటి నిల్వలు లేకుండా చూడాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ సాంబశివుడు, ఎస్‌ఐ షాకీర్‌, రాజారత్నం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి..



మాట్లాడుతున్న రామేశ్వర్‌గౌడ్‌, పక్కన డీఈఓ

ఖమ్మంసహకారనగర్‌: రాష్ట్ర పరిశోధన సంస్థ సహకారంతో విల్‌ టూ కెన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంగ్లిష్‌ ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ అన్నారు. ఆదివారం నగరంలోని మంచికంటిభవన్‌లో సంస్థ డైరెక్టర్‌ రామేశ్వర్‌గౌడ్‌ ఆధ్వర్యంలో ఇచ్చిన ఉచిత శిక్షణను డీఈఓ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం రామేశ్వర్‌గౌడ్‌ మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 29 జిల్లాల్లో 49 వేల మంది ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ ఇచ్చామని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి తెలుగు మాట్లాడినట్లుగా ఇంగ్లిష్‌ మాట్లాడేలా చేయడమే శిక్షణ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అలాగే, ఎస్‌సీఈఆర్‌టీ సహకారంతో రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో శిక్షణ పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం డీఈఓ సోమశేఖరశర్మకు స్పోకెన్‌ ఇంగ్లిష్‌ పుస్తకాలను బహూకరించారు. కార్యక్రమంలో జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, ఖాదర్‌, చంద్రశేఖర్‌, లింగం సతీశ్‌, నెల్లూరి వీరబాబు, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్మృతి యాత్ర



దమ్మక్క చిత్రపటంతో గిరిప్రదక్షణ చేస్తున్న అర్చకులు

- దమ్మక్క చిత్రపటంతో గిరి ప్రదక్షణ, పూజలు
- ఘనంగా గోవిందరాజస్వామి కల్యాణం

భద్రాచలం: భద్రగిరి క్షేత్రంలో సీతారాముల విగ్రహాలను పూజించిన ఆద్యురాలు, రామయ్యకు అపర భక్తురాలు అయిన పోకల దమ్మక్క సేవా స్మృతి యాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆషాఢ పౌర్ణమి రోజున భద్రాచలంలో ఈ వేడుక నిర్వహించడం 2014 నుంచి ఆనవాయితీగా వస్తోంది. మొదట ఆలయ ప్రాంగణంలోని పొగడ చెట్టు వద్దనున్న దమ్మక్క విగ్రహానికి పూజలు చేశారు. తర్వాత మేళతాళాలు, కోలాటాలు, గిరిజన సంప్రదాయ నృత్యాల నడుమ దమ్మక్క చిత్రపటంతో ఆలయ అర్చకులు, అధికారులు మిథిలా స్టేడియం వద్ద నున్న భక్త రామదాసు విగ్రహం వద్దకు, అక్కడి నుంచి టూరిజం హోటల్‌ వద్ద గల దమ్మక్క విగ్రహం వద్దకు వచ్చారు. ప్రత్యేక పూజలు చేసి వస్త్రాలు, పండ్లు సమర్పించారు. రామదాసు కీర్తనలు, కోలాటాలతో నగర సంకీర్తన చేశారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, తాతగుడి సెంటర్‌లో వేంచేసియున్న గోవింద రాజ స్వామి వారి తిరుకల్యాణోత్సవం కూడా వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి–భూదేవి సమేత గోవింద రాజ స్వామి వారికి దేవస్థానం తరపున అధికారులు ముత్యాల తలంబ్రాలు, వస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

తండ్రి విగ్రహం ఏర్పాటుచేసిన కుమారులు

నేలకొండపల్లి: కాంగ్రెస్‌ నాయకులు గుండపనేని పరాంకుశరావు సేవలు మరవలేనివని పలువురు కొనియాడారు. మండలంలోని భైరవునిపల్లిలో పరాంకుశరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా కుమారులు గుండపనేని రాంచందర్‌రావు, లక్ష్మణరావు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు.. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందించారని, గ్రామాభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో సినీ నిర్మాత లక్ష్మణ్‌, వివిధ పార్టీల నాయకులు చెరువు స్వర్ణ, కనకబండి సీతారాములు, గోళ్ల శ్రీనివాసరావు, గోపి ఉపేందర్‌, కనకబండి రమేశ్‌, పోలంపల్లి నాగేశ్వరరావు, మల్లేబోయిన ఉపేందర్‌, గండు సైదులు, నూక పెద్దనాగయ్య, బెజవాడ నాగేశ్వరరావు, పోలంపల్లి వెంకటపిచ్చయ్య, పెద్దపాక సైదులు తదితరులు పాల్గొన్నారు.



పరాంకుశరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

బస్సులో డీజిల్‌ చోరీ



కేఎంసీ వద్ద నిలిచిపోయిన ఆర్టీసీ అద్దె బస్సు

ఖమ్మంమయూరిసెంటర్‌: ఆర్టీసీ అద్దె బస్సు డీజిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సును ఖమ్మంలోని కేఎంసీ పక్కన యజమాని ఇంటి వద్ద శనివారం రాత్రి పార్కింగ్‌ చేశారు. ఆదివారం ఉదయం బస్సును తీసుకొని వెళ్లేందుకు వచ్చిన డ్రైవర్‌.. దానిని రివర్స్‌ చేస్తుండగా ఒక్కసారిగా ఆగిపోయింది. సాంకేతిక సమస్య అని మెకానిక్‌ను పిలిపించి చెక్‌ చేయించగా.. బస్‌ డీజిల్‌ ట్యాంకర్‌ వద్ద పైపు కట్‌ చేసి ఉండడాన్ని గమనించారు. డీజిల్‌ను చోరీ చేసినట్లు గుర్తించి, పైపునకు మరమ్మతు చేశారు. ఇక బస్సుతో పాటు అక్కడే నిలిపి ఉంచిన లారీ డీజిల్‌ను కూడా చోరీ చేసినట్లు తెలిసింది.

రిజిస్ట్రేషన్‌ శాఖలో బదిలీలు

ఉమ్మడి జిల్లాలో 13 మంది సీనియర్‌ అసిస్టెంట్లకు స్థానచలనం

ఖమ్మంమయూరిసెంటర్‌ : స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ శాఖలో సీనియర్‌, జూనియర్‌ అసిస్టెంట్లు, ఆఫీస్‌ సబార్డినేట్లు, టైపిస్టులను బదిలీ చేస్తూ ఆ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో 13 మంది సీనియర్‌ అసిస్టెంట్లు వరంగల్‌ జిల్లాకు బదిలీ కాగా.. వరంగల్‌ జిల్లా నుంచి ఖమ్మం కు 13 మంది బదిలీపై రానున్నారు. ఖమ్మం ఆర్‌ఓలో పని చేస్తున్న ఎస్‌.కిరణ్‌కుమార్‌, ఎస్‌కే నజీర్‌, కె.కరుణ వరంగల్‌ ఆర్‌ఓకు, పి.రామ్‌కుమార్‌ వరంగల్‌ డీఐజీ ఆఫీస్‌కు, ఆర్‌.వెంకట్‌లాల్‌ వరంగల్‌ పోర్ట్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ ఆఫీస్‌కు, మార్కెట్‌ వ్యాల్యూ, ఆడిట్‌లో విధులు నిర్వర్తిస్తున్న పి.హేమలత ఏఆర్‌సీ వరంగల్‌కు, ఎస్‌ఆర్‌ఓగా కల్లూరులో విధులు నిర్వర్తిస్తున్న వి.సతీష్‌రెడ్డి వరంగల్‌ ఆర్‌ఓకు, ఖమ్మం ఆర్‌ఓలో విధులు నిర్వర్తిస్తున్న కె.విజయ్‌ వరంగల్‌ డీఐజీ ఆఫీస్‌కు, ఎండీ జానీపాషా వరంగల్‌ మార్కెట్‌ వ్యాల్యూ ఆడిట్‌కు, కొత్తగూడెం ఎస్‌ఆర్‌ఓలో విధులు నిర్వర్తిస్తున్న బి.రామకృష్ణ వరంగల్‌ ఆర్‌వోకు, వైరా ఎస్‌ఆర్‌వోలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌కే ఖదీర్‌ వరంగల్‌ ఆర్‌వోకు, ఖమ్మం ఆర్‌వోలో విధులు నిర్వర్తిస్తున్న వి.ప్రశాంతి ఏఆర్‌సీ వరంగల్‌కు, కె.కిరణ్‌ ఆర్‌వో వరంగల్‌కు బదిలీ అయ్యారు. ఇక వరంగల్‌ డీఐజీ ఆఫీస్‌లో విధులు నిర్వర్తిస్తున్న వి.మురళీకృష్ణ, పి.స్వర్ణలత, వరంగల్‌ మార్కెట్‌ వ్యాల్యూ ఆడిట్‌లో విధులు నిర్వర్తిస్తున్న డి.మునేందర్‌, ఏఆర్‌సీ వరంగల్‌లో విధులు నిర్వర్తిస్తున్న జి.జయశ్రీ ఖమ్మం ఆర్‌వోకు, వరంగల్‌ ఆర్‌వోలో విధులు నిర్వర్తిస్తున్న బి.రాజేష్‌ ఎస్‌ఆర్‌వో కల్లూరుకు, కె.రాజేష్‌ ఆర్‌వో ఖమ్మంకు, ఎస్‌.భూపాల్‌కర్నా ఆర్‌వో ఖమ్మం రూరల్‌, కె.ఆర్‌.సునీల్‌కుమార్‌ ఎస్‌ఆర్‌వో మధిర, జి.రంజిత్‌ రాయి ఎస్‌ఆర్‌ఓ కొత్తగూడెంకు, పి.శ్రీనివాస్‌ ఏఆర్‌సీ ఖమ్మంకు, ఎస్‌ఆర్‌వో వరంగల్‌ పోర్ట్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీ.ప్రవీణ్‌కుమార్‌ ఖమ్మం ఆర్‌వోకు, వరంగల్‌ ఆర్‌వోలో విధులు నిర్వర్తిస్తున్న ఎం.కార్తిక్‌ వైరా ఎస్‌ఆర్‌వోకు, వరంగల్‌ డీఐజీలో విధులు నిర్వర్తిస్తున్న కె.జ్యోతి లక్ష్మి ఖమ్మం మార్కెట్‌ వ్యాల్యూ అండ్‌ ఆడిట్‌కు బదిలీపై రానున్నారు. ఇక 31 మంది జూనియర్‌ అసిస్టెంట్‌లకు, 12 మంది ఆఫీస్‌ సబార్డినేటర్స్‌కు, 31 మందికి, ఒక టైపిస్ట్‌కు అంతర్‌ జిల్లాలోనే బదిలీలు జరిగాయి.

నేటి నుంచి 'శిక్ష సప్తాహ్‌'

ఖమ్మంసహకారనగర్‌: నూతన జాతీయ విద్యావిధానం – 2020ని అమల్లోకి తీసుకొచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సమగ్ర శిక్షా అభియాన్‌ ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్‌ (విద్య వారోత్సవాలు) పేరుతో కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఇందులో భాగంగా ప్రతి రోజు ఒక కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, ఆయా కార్యక్రమాలకు సంబంధించి జియో టాగ్‌ కలిగిన ఫొటోలు, వీడియోలను నిర్దేశించిన గూగుల్‌ డ్రైవ్‌లో అప్‌లోడ్‌ చేయాలని సూచించారు. అంతేకాకుండా పాఠశాల స్థాయిలో కార్యక్రమ నివేదికను రూపొందించి సాఫ్ట్‌ కాపీని జిల్లా విద్యాశాఖాధికారికి మెయిల్‌ చేయాల్సి ఉంటుంది. కాగా, జిల్లాలోని 1,235 పాఠశాలల్లో 67,229 విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. శిక్ష సప్తాహ్‌ కార్యక్రమాల నిర్వహణను మండల స్థాయిలో ఎంఈఓలు, మండల నోడల్‌ అధికారులు, కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాల్సి ఉంటుంది.

కార్యక్రమాలిలా...

ఈ నెల 22వ తేదీన టీఎల్‌ఎం కార్యక్రమం, 23వ తేదీన ఎఫ్‌ఎల్‌ఎన్‌ డే, 24న స్పోర్ట్స్‌ డే, 25న కల్చరల్‌ డే, 26న స్కిల్‌ అండ్‌ డిజిటల్‌ ఇన్షివిటీస్‌ డే, 27న ఏకో క్లబ్‌ మిషన్‌ లైఫ్‌ / స్కూల్‌ న్యూట్రిషన్‌ డే, 29న కమ్యూనిటీ ఇన్‌వాల్వ్‌మెంట్‌ డే నిర్వహించనున్నారు.

తప్పనిసరిగా అమలుచేయాలి



జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్ష సప్తాహ్‌ తప్పనిసరిగా ఘనంగా నిర్వహించాలి. పాఠశాలలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులను, తల్లిదండ్రులను, దాతలను భాగస్వాములు చేయాలి. తప్పనిసరిగా జియో ట్యాగ్‌ కలిగిన ఫొటోలు, వీడియోలు, పాఠశాల స్థాయి కార్యక్రమ నివేదికను జిల్లాకు పంపించాల్సి ఉంటుంది.

– సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి..

ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువుల ఆందోళన

ఖమ్మంవైద్యవిభాగం: వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం నగరంలో చోటుచేసుకుంది. దీంతో మృతుడి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. కామేపల్లి మండలం బర్లగూడెం గ్రామానికి చెందిన బానోత్‌ శంకర్‌నాయక్‌కు జ్వరం రావడంతో బంధువులు శనివారం శివశంకర్‌ థియేటర్‌ ప్రాంతంలోని ఆరోగ్య కేన్సర్‌ ఇనిస్టిట్యూట్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందటంతో బంధువులు పెద్దఎత్తున ఆస్పత్రి వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. సరైన వైద్యం అందించకపోవటం వల్లే మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు స్పష్టం చేశారు. రాత్రి నుంచి ఉదయం వరకు వైద్యం అందిస్తున్నామని చెప్పి లోపలికి వెళ్లనివ్వకుండా చేశారని వాపోయారు. చివరికి మృతదేహాన్ని కూడా చూడనివ్వకుండా అడ్డుకున్నారని, తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఆస్పత్రి యాజమాన్యాన్ని ప్రశ్నించినందుకు తమపై గూండాలను పురమాయించారని, మృతికి కారణమైన ఆస్పత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్‌ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో వన్‌టౌన్‌ పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. చివరికి ఆస్పత్రి యాజమాన్యంతో మృతుడి బంధువులు చర్చలు జరిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు

ఇద్దరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు



వెంకటరత్నం (ఫైల్‌)



హైమావతి (ఫైల్‌)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న వైరా సీఐ సాగర్‌, ఎస్‌ఐ నాగుల్‌మీరా

చింతకాని: మండలంలోని జగన్నాథపురం సమీపంలో ఖమ్మం – బోనకల్‌ ప్రధాన రహదారిపై ఆదివారం ఆటోను కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతిచెందారు. నలుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్‌ జిల్లా వత్సవాయి మండలం కన్నెవీడు గ్రామానికి చెందిన కరిసె సుజాత అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఆమెను భర్త కరిసె వెంకటరత్నం (50), ఆయన అక్క చావల శాంతమ్మ మూడు రోజుల కిందట ఖమ్మంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెకు ఆపరేషన్‌ చేయగా చూసేందుకు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన సుజాత తమ్ముడు చెరుకుపల్లి రాంబాబు, ఆయన భార్య చెరుకుపల్లి హైమావతి (45) ఆస్పత్రికి వచ్చారు. సుజాతను డిశ్చార్జ్‌ చేయటంతో అందరూ కలిసి కన్నెవీడు గ్రామానికి వచ్చేందుకు ఖమ్మంలో ఆటో కిరాయికి మాట్లాడుకుని బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో చింతకాని మండలం జగన్నాథపురం గ్రామ సమీపంలోకి రాగానే బోనకల్‌ వైపు నుంచి ఖమ్మం వైపు వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఆటో రోడ్డు పక్కకు ఎగిరిపడగా కరిసె వెంకటరత్నం అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన చెరుకుపల్లి హైమావతి, రాంబాబు, చావల శాంతమ్మ, ఆటోడ్రైవర్‌ను 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో హైమావతి మృతి చెందింది. రాంబాబు, శాంతమ్మ, సుజాతతో పాటుగా ఇల్లెందు పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్‌ సిరాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారు సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగుల్‌మీరా అక్కడికి చేరుకుని క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని వైరా సీఐ సాగర్‌ పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు వెంకటరత్నం కన్నెవీడు సొసైటీలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు.

పేకాట స్థావరంపై దాడి

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండాలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.8,100 నగదు, ఐదు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తోట నాగరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ముదిగొండ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని వనంవారికిష్టాపురం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ముత్తారం గ్రామానికి చెందిన నారపొంగు సింహాద్రి (20) ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి సొంత గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో వనంవారికిష్టాపురం సమీపానికి రాగానే పణితి ప్రేమ్‌కుమార్‌ అతివేగంగా, నిర్లక్ష్యంగా డోజర్‌ నడుపుతూ వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన సింహాద్రిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడి సోదరుడు వాసు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నరేశ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రమాదంలో ఒకరికి గాయాలు

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన పాలకుర్తి వీరబాబు ఆదివారం ఇంటి నుంచి నేలకొండపల్లికి బైక్‌పై వస్తున్నాడు. మండల కేంద్రానికి రాగానే వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వీరబాబును స్థానికులు ఖమ్మం తరలించారు.

రైలు ఢీకొని గొర్రెలు మృతి

పెనుబల్లి: మండలంలోని పార్థసారథిపురం గ్రామ శివారులోని రైల్వే అండర్‌ బ్రిడ్జి సమీపంలో గూడ్స్‌ రైలు ఢీకొని 20 గొర్రెలు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జోగు నానయ్యకు చెందిన గొర్రెలు అండర్‌ బ్రిడ్జి సమీపంలో ట్రాక్‌పై మేత మేస్తుండగా సత్తుపల్లి సింగరేణి నుంచి బొగ్గు లోడుతో కొత్తగూడెం వెళ్తున్న గూడ్స్‌ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో 20 గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని నానయ్య కన్నీటి పర్యంతమయ్యాడు.